క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పెదబయలు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా వేసినట్టు ఎంపీడీవో విగ్గిన్స్ తెలిపారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరగనున్నట్టు ముందుగానే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు సమాచారం అందించామన్నారు. అయితే సంక్రాంతి పండగ కావడంతో 15 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను అతి తక్కువ మంది హాజరు కావడంతో సమావేశం శుక్రవారానికి వాయిదా వేసినట్టు తెలిపారు. పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం 90 రోజులు దాటకుండా సమావేశం నిర్వహించాల్సి ఉందని ఈ నెల 19 తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చీడిపాలెంలో పోలింగ్ కేంద్రంలో పరిసరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంగవరం : మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తహసీల్దార్ శ్రీమన్నారాయణ చెప్పారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. లోతట్టు ప్రాంతమైన చీడిపాలెం గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో గదులు, పరిసరాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవో మల్లేశ్వరరావు, ఏఈ శివప్రసాద్, డీటీ వీరభద్రరావు, ఆర్ఐ జిలానీ, వీఆర్వో వెంకన్న తదితరులున్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బాలమ్మ

కొయ్యూరు: మండల కేంద్రంలోని వాల్మీకి వీధిలోని రామాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్తురాలు శెట్టి బాలమ్మ స్థానిక మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పోర్టు ఉద్యోగిగా చేసిన ఆమె కొద్ది నెలల కిందట రిటైర్డ్ అయ్యారు. ఆమె ఆలయం నిర్మాణానికి సహకరించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు, తువ్వాళ్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని కోరారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం బాబా వారికి తిరువీధి సేవలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్టీఆర్‌కు నివాళి



జడేరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. టీడీపీ నేతలు సుబ్బారావు, అబ్రహం తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంగవరం: జడేరులో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, నేతలు ప్రభ, బుల్లియ్యమ్మ, శేషు, ఎంపీటీసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

విజ్ఞాన వెలుగులు





శిథిల భవనాల్లో..పెచ్చులూడిన శ్లాబు, బీటలు వారిన గోడలు..వర్షం పడితే గదులు జలమయం.. పాడైన విలువైన పుస్తకాలు.. ఆందోళనలో పాఠకులు.. అద్దె గృహాల్లో ఇరుకైన గదిలో అరకొర పుస్తకాలు, కానరాని కనీస సదుపాయాలు..ఇదీ టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాల దుస్థితి... గ్రంథాలయాల నిర్వహణపై టీడీపీ పాలకులు కనీసం పట్టించుకోకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.. అదంతా గతం... జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యకు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా పాఠశాలలతో పాటు విజ్ఞాన కేంద్రాలైన శాఖా గ్రంథాలయాల అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. లక్షలాది రూపాయలతో గ్రంథాలయ భవనాలను నిర్మించింది. గ్రంథాలయాలకు మోక్షం కలిగింది. నేడు గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్స్ అందుబాటులో ఉండడంతో పాఠకులు, విద్యావేత్తలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

అరకులోయటౌన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో శిథిలభవనాల్లో.. అరకొర పుస్తకాలు..కానరాని వసతుల నడుమ గ్రంథాలయాలు ఉండేవి...నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్స్‌తో పాటు ఇంటర్నెట్ సౌకర్యం, మౌలిక సదుపాయాలతో గ్రంథాలయాలు దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అనే నానుడికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రంథాలయాలకు మహర్దశ చేకూరుంది. మండల కేంద్రంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.33లక్షలు వెచ్చించింది. అంతే కాకుండా మరో రూ.14 లక్షలతో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్డు నిర్మించింది.

గతంలో సమస్యలివీ..

అరకులోయలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉండేది.. తలుపుల, కిటికీలు ఊడిపోయి ఆకతాయిలకు అడ్డాగా మారింది. పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లు. టీడీపీ ప్రభుత్వం దినపత్రికలకు కూడా డబ్బులు చెల్లించకపోవడంతో పాటు కథల పుస్తకాలు కూడా ఉండేవి కావు..కూర్చొడానికి కుర్చీలు లేక పాఠకులు నానా అవస్థలు పడేవారు. దీంతో పాటు భవనానికి ప్రహరీ లేకపోవడంతో స్థలం కబ్జాకు గురైంది. ఇంత జరిగినా టీడీపీ పాలకులు గ్రంథాలయం నిర్వహణపై కనీసం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక గ్రంథాలయ భవనం నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించింది. లైబ్రరీలో అన్ని సౌకర్యాలు, సదుపాయాలను కల్పించడంతో పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాలకు పునర్‌వైభవం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలోని గ్రంథాలయం పాత భవనాన్ని తొలగించి, రూ. 33 లక్షలతో కొత్త భవనాన్ని ఏడాదిలోనే నిర్మించారు. అంతే కాకుండా రూ.14 లక్షలు వెచ్చించి మరుగుదొడ్లు, సీసీ రోడ్డు, తాగునీటి సౌకర్యం, రంగులు వేయించారు. పాఠకుల సౌకర్యార్థం దిన పత్రికలు, వార పత్రికలు, చిన్నారులకు కథల పుస్తకాలు, పోటీ పరీక్షల అభ్యర్థులు, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.దీంతో పాటు ఇతిహాస గ్రంథాలు, చరిత్ర, ఇంగ్లిష్ గ్రామర్, తెలుగు వ్యాకరణం తదితర పుస్తకాలను అందుబాటలో ఉంచారు. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య క్రమేణా పెరుగుతూ వచ్చింది.



గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



అరకులోయలో శాఖా గ్రంథాలయం



గ్రంథాలయంలోని పుస్తకాలు

ఆనందంగా ఉంది



వైఎస్సార్‌సీపీ అధి కారంలోకి వచ్చిన తరువాత శిథిలమైన నిర్మాణాన్ని భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించింది. పాఠకులకు ఇబ్బంది లేకుండా విశాలమైన భవనం నిర్మించి, ఫర్నీచర్ సమకూర్చింది. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పాఠకులకు ఎంతో ఉపయోగంగా ఉంది. చాలా ఆనందంగా ఉంది.

అదారి అప్పన్న, దుంబ్రిగుడ గ్రామం లోతేరు పంచాయతీ, అరకులోయ

జగనన్నకు రుణపడి ఉంటాం



నేను గ్రూపు–2 పరీక్షకు సిద్ధమవుతున్నాను. ఇక్కడి లైబ్రరీలో ప్రతీ రోజు దినపత్రికలు, ఇతర కాంపిటేటివ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు ఇక్కడ ఉన్న పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జగనన్న ప్రభుత్వంలో గ్రంథాలయాలకు జీవనం పోశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– **వంతాల మొత్తి**, బి.గంగగుడ్డి గ్రామం, అరకులోయ మండలం

పెరుగుతున్న పాఠకుల సంఖ్య



అరకులోయ గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పోటీ పరీక్షలకు సిద్ధపడేవారికి కాంపిటేటివ్ పుస్తకాలు, దినపత్రికలు, చిన్నారులకు కథల పుస్తకాలన్ని అందుబాటులో ఉన్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రంథాలయానికి భవన నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. పాఠకులకు ఇబ్బందులు లేకుండా ఉన్నాయి.

– **శెట్టి సునీత**, లైబ్రేరియన్, అరకులోయ

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీవో కె.బాపన్నదొర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 17 గ్రామ సచివాలయాల పరిధి నుంచి ఆయా క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎంపిక చేసి మండల స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థ మహోత్సవం



మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం



పైడితల్లమ్మ తీర్థ మహోత్సవంలో జనసందోహం

రాంబిల్లి : మామిడివాడ గ్రామంలో గురువారం పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భారీగా తీర్థ మహోత్సవం జరిగింది. పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనంతో ప్రాంగణం నిండిపోయింది. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. రంగుల రాట్నాలు ఎక్కేందుకు జనం పోటీ పడ్డారు. కొప్పుగొండుపాలెం, వెంకటాపురం గ్రామాల్లోనూ గురువారం సీతారాముల తీర్థమహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తప్పెటగుళ్లు, కోలాటాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

జాతర్లతో.. పల్లెలు జిగేల్

కె.కోటపాడు : మండలంలో సింగన్నదొరపాలెం, గొట్లాం, చౌడువాడ గ్రామాల్లో గురువారం ఘనంగా తీర్థ మహోత్సవాలు జరిగాయి. సింగన్నదొరపాలెంలో మరిడిమాంబ, గొట్లాంలో చింతాలమ్మ, చౌడువాడలో శ్రీకృష్ణుని తీర్థ మహోత్సవాలు జరిపిన భక్తులు ఘనంగా పూజలు చేశారు. సింగన్నదొరపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంగలి సూర్యనారాయణ, రొంగలి వెంకటరమణ, లాలం నాని, మాజీ ఎంపీపీ నారపాటి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి లక్ష్మి పూజలు చేశారు.

ఘనంగా కుంతీదేవి ఊరేగింపు..

నాతవరం: మండల కేంద్రంలో గురువారం కుంతీదేవి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. నాతవరం ఎస్సీ కాలనీలో పూర్వం నుంచీ కుంతీదేవిని ఇంటి ఇలవేల్పుగా పూజిస్తారు. నెల రోజుల పాటు కుంతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంక్రాంతి పండగ అనంతరం గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేయడం ఆచారంగా వస్తోంది. ఈ ఏడాది కూడా గ్రామ పుర వీధుల్లో కుంతీదేవిని అంగ రంగ వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంతీదేవిని శిరస్సున పెట్టుకుని కోలాటం ఆడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ బాణసంచా వెలిగించి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, సర్పంచ్ రాణి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, మాజీ ఉప సర్పంచ్ లంక రాంబాబు, డ్వాక్రా మహిళలు, కుంతీదేవి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



కొంకసింగి తీర్థంలో జనం సందడి

కొంకసింగిలో తీర్థమహోత్సవం..

గొలుగొండ : సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని కొంకసింగిలో గురువారం తీర్థ మహోత్సవం జరిగింది. తీర్థాలకు కె.ఎల్.పురం, నాగాపురం, పాతకృష్ణదేవిపేట గ్రామాల నుంచి ఆయా గ్రామపెద్దలు తోడపెద్దులు, భజన బృందాలతో వచ్చారు. తీర్థంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థం తిలకించేందుకు గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

ఎ. కొత్తపల్లిలో..

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లిలో ముత్యమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాస్థాయి బాలుర కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 15 టీమ్‌లు పాల్గొన్నాయి. ఉదయం 8 గంటల నుండి ప్రారంభమైన కబడ్డీ పోటీలు అర్ధరాత్రి వరకు జరిగాయి. ఈ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరి నాయుడు, సర్పంచ్, వైస్ ఎంపీపీ, స్థానిక గ్రామ పెద్దలు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు.

హక్కుల పరిరక్షణకు కృషి



మానవ హక్కుల కమిషన్ గౌరవ సభ్యురాలు విజయ భారతిని కలిసిన బాలు

రంపచోడవరం: హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాలు అక్కిస న్యూఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇండియా గౌరవ సభ్యు రాలు సాయానీ విజయభారతిని కలిశారు. మానవ హక్కుల ఉల్లంఘనలను ఆమె దృష్టి తీసుకెళ్లినట్టు బాలు తెలిపారు. హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఏజెన్సీని సందర్శించాలని ఆమె ఆహ్వానించగా, పర్యటిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రణాళికపై శిక్షణ



చింతపల్లిలోని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి



అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర



మారేడుమిల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

చింతపల్లిరూరల్: మండలంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో తలపెట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, సహజ వనరుల సద్వినియోగం, ఉపాధి కల్పన వంటి పలు అంశాలపై చర్చించారు. ఏవో రవీంద్ర, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఎంపీడీవో విజయ రంగారావు ఆధ్వర్యంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కుల గణన ప్రక్రియపై సూచనలిచ్చారు. ప్రతి సచివాలయానికి అందజేసిన ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భవ కార్డుల పంపిణీలో వలంటీర్లు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఎంపీడీఓ ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయన్నారు.



రాజవొమ్మంగిలో సూచనలిస్తున్న ఎంపీడీవో విజయ రంగారావు

అడ్డతీగల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.బాపన్నదొర ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక తయారీ విధానాన్ని వివరించారు. ఈవోపీఆర్డీ చిన్నబాబు, కో–ఆప్షన్ సభ్యులు షాబుద్దీన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల ప్రణాళికపై ఎంపీపీ సార్ల లలిత కుమారి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల వివరాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎంపీడీవో వీరాకిషోర్, విస్తరణాధికారి విజమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

వీఆర్ పురం: ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాఘవయ్య గురువారం తెలిపారు. ఈ మేరకు 2022 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ వరకు 11 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులు, నిధుల వినియోగంపై ఉన్నతాధికారులు తనిఖీ నిర్వహిస్తారన్నారు. పంచాయతీల స్థాయిలో సంబంధిత సిబ్బంది ఇప్పటికే పనులపై నివేదికలు సిద్ధం చేశారని, వాటిపై సమావేశంలో చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు ఆర్. భీమవరంలో ఎడ్ల పందాలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల ఆర్. భీమవరంలో శుక్రవారం సీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఉట్టికొట్టు, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిపొందిన విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. తీర్థ మహోత్సవంలో తప్పెటగుళ్ళు, తోడపెద్దు భజన, మహిళల కోలాటం ఏర్పాటు చేశామన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



పాతగంగవరంలో ఇంటింటా అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు



కొయ్యూరులో అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గంగవరం : పాత గంగవరం గ్రామంలో రామాలయ కమిటీ, రామదాసు మహిళా కమిటీ సభ్యులు, విశ్వహిందు పరిషత్ కార్యకర్తలు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. రామదాసు మహిళా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి వెళ్లి అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ వివరాలు తెలియజేసి, అక్షింతల వినియోగాన్ని వివరిస్తూ పంపిణీ చేశారు. అయోధ్యలోని ఈ నెల 22న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ప్రతీ ఇంట్లో ఐదు జ్యోతులను ప్రజ్వలన చేయాలని, రామాలయానికి వచ్చి పూజలు చేయాలని విశ్వాహిందూ పరిషత్ మండల కార్యదర్శి వై.రామకృష్ణ ప్రసాద్ వివరించారు. రామదాసు మహిళా కమిటీ అధ్యక్షురాలు పండమ్మ, రామాయమ్మ ,రాణి, కమిటీ సభ్యులు బాపనమ్మ, మల్లమ్మ, మంగాదేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, గంగాభవానీ పాల్గొన్నారు.

కొయ్యూరు: కినపర్తి పంచాయతీలో చుట్టుబంద, రిట్టమానిపాలెం, వలసంపేట, గాదేగుమ్మి, భీమవరం, ములగలమెట్ట గ్రామాల్లో గురువారం అయోధ్య నుంచి తీసుకు వచ్చిన పవిత్ర అక్షింతలను ఊరేగింపుగా ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. అయోధ్య రామ మందిర స్టిక్కర్లు అందజేశారు. అయోధ్య బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఈనెల 22న చేయాల్సిన పూజలు, దీపారాధన గురించి గ్రామస్తులకు వివరించారు. సర్పంచ్ రీముల శ్రీను, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబు, వీహెచ్‌పీ ప్రతినిధులు మల్లిబాబు, వీర్రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో బుడియాల సందడి



కోసంగి పనసపుట్టులో బుడియాల సందడి

దుంబ్రిగుడ: గిరిజనుల సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో బుడియాలు సందడి చేస్తున్నారు. వివిధ వేషధారణలో ఇంటింటా వెళ్లి బియ్యం, డబ్బులు వసూలు చేస్తారు. పది రోజుల గిరిజన సంక్రాంతి పండగ పూర్తయిన తరువాత బుడియాలు వసూలు చేసిన చందాలు, బియ్యం, ఇతరత్రా సరకులతో వనభోజనం కార్యక్రమం ఏర్పాటుచేసి, గ్రామ పెద్దలు, ఇతరులను ఆహ్వానించి వేడుక జరుపుకుంటారు. గిరిజన గ్రామాల్లో బుడియాలు వివిధ వేషధారణతో డ్యాన్సులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.